క్లుప్తంగా

సిమెంటు రోడ్డు పనుల పరిశీలన


సిమెంటు రోడ్డు పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

నగరి: మున్సిపల్ పరిధి కాకవేడు సచివాలయం రాజీవ్‌నగర్‌లో సిమెంటు రోడ్డు పనులను మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి గురువారం పరిశీలించారు. ఈ ప్రాంతంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించిన సమయంలో స్థానికులు సీసీ రోడ్డు వేయాలని మంత్రి ఆర్కేరోజాను కోరారు. దీనిపై ఆమె స్పందించారు. మంత్రి ఆదేశాలతో నివేదికలు సిద్ధం చేసిన అధికారులు రూ.3.5 లక్షలతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో డీఈ నరేష్, స్థానిక నాయకులు మునివేలు, చిన్నదొరై తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల్లో కేకేసీ కాలేజీ క్రీడాకారుల ప్రతిభ


వాలీబాల్ పోటీల్లో కప్‌ను అందుకున్న కేకేసీ క్రీడాకారులు

పుత్తూరు: డాక్టర్ వైఎస్ఆర్ హెల్త్ యూనివర్సిటీ అంతర కళాశాలల గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌లో పుత్తూరుకు చెందిన కేకేసీ కళాశాల క్రీడాకారులు సత్తా చాటారు. ఈ పోటీల్లో కేకేసీ కళాశాలకు చెందిన ఫిజియోథెరఫీ విభాగం క్రీడాకారులు వాలీబాల్ పోటీల్లో రన్నర్స్‌గా నిలిచారు. గురువారం కేకేసీలో వారిని కళాశాల చైర్మన్ కె.కుప్పయ్య, పీఈటీ మాబు సుబానీని అభినందించారు. వైస్ చైర్మన్ నరసింహారావ్ మాట్లాడుతూ, కేకేసీ విద్యా సంస్థల్లో క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ మగేష్, వైస్ ప్రిన్సిపల్ రెడ్డికుమార్, వాలీబాల్ టీమ్ కెప్టెన్ నవీన్, ఇతర క్రీడాకారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు నంబాలపల్లెలో పశువుల పండుగ

వెదురుకుప్పం: మండలంలోని జక్కిదొన పంచాయతీ నంబాలపల్లె(కేఎస్‌పెంట) గ్రామంలో శుక్రవారం పశువుల పండుగను నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. సంక్రాంతి సంబరాలను పురస్కరించుకుని ఎద్ల పందేలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎద్లపందేలను తిలకించేందుకు వచ్చే జనాలకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తున్నట్లు నిర్వాహకులు చెప్పారు.

పెనుమూరు ఎంఈవోగా రాజేంద్రన్



పెనుమూరు(కార్వేటినగరం): మండల విద్యాశాఖ అధికారి–1గా ఎస్.రాజేంద్రన్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా బోధనలో తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులకు అనుగుణంగా ఉపాధ్యాయులు పనిచేయాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. రాజేంద్రన్‌ను ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

కట్నం వేధింపులు.. ఏడుగురిపై కేసు

ఏర్పేడు: అదనపు కట్నం కోసం వేధించిన ఘటనలో ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీరామ శ్రీనివాసులు గురువారం రాత్రి తెలిపారు. వివరాలు.. మన్నసముద్రం గ్రామానికి చెందిన లక్ష్మీదేవికి రేణిగుంట మండలం కాటన్‌మిల్లు పూలవానిగుంట వీధికి చెందిన బాలకృష్ణతో 2022 సెప్టెంబర్ 8న వివాహమైంది. అప్పట్లో రూ.5 లక్షల నగదు, 20 సవర్ల బంగారు నగలను కట్నంగా అందజేశారు. రెండునెలలు సంతోషంగా కాపురం చేశారు. అనంతరం అదనపు కట్నంకోసం బాలకృష్ణతో పాటు కుటుంబ సభ్యులు కిరణ్‌కుమార్, చిట్టెమ్మ, సుబ్రమణ్యంరెడ్డి, లావణ్య, శ్యామల, సుబ్రమణ్యం వేధిస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఏడుగురిపై కేసు నమోదు చేశారు.

ఎంబీయూలో వర్క్‌షాప్

చంద్రగిరి: మోహన్‌బాబు యూనివర్సిటీ(ఎంబీయూ) దాసరి ఆడిటోరియంలో రీసెర్చ్ మెథడాలజీ, పబ్లికేషన్ ఎథిక్స్ అనే అంశంపై మూడు రోజుల వర్క్‌షాపును గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సింగపూర్‌లోని నేషనల్ టెక్నలాజికల్ యునివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ నరసింహన్ సుందరరాజన్ పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. పరిశోధన అనేది ఒక మహా యజ్ఞమని అది రోజంతా పట్టుదల, దీక్షతో సాధన చేస్తే గాని కొన్ని సంవత్సరాలకు సిద్ధిస్తుందన్నారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన మైసూరు జేఎస్ఎస్ సైన్స్ అండ్ టెక్నాలజీ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ ఆనంద్ మాట్లాడుతూ.. పట్టుదలతో శ్రమించి చేస్తేనే పరిశోధక విద్యార్థి తన మేధస్సును పెంపొందించుకోలేడని తెలిపారు. ఎంబీయూ వీసీ ఆచార్య నాగరాజ రామారావు మాట్లాడుతూ.. పరిశోధన అనేది ప్రపంచానికి ఎంతో అవసరమన్నారు.

స్వయం దర్పం.. హోదా గౌరవం

- నగరి ప్రభుత్వ డిగ్రీకళాశాలకు 'అటామనస్'
- నాలుగేళ్లలో అభివృద్ధితో ముందడుగు
- ఇప్పటికే రాష్ట్రస్థాయిలో ఏ+ గ్రేడ్ పొందిన రెండవ కళాశాలగా గుర్తింపు
- విద్యాభివృద్ధికి మంత్రి ఆర్కేరోజా సహకారం

నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల నాలుగేళ్ల కాలంలో ఉన్నత ప్రమాణాల దిశగా చేస్తున్న కృషి ఫలించింది. విద్యాబోధన, కోర్సులు, నైపుణ్యాల పెంపు..ఇలా వివిధ అంశాల్లో సాధించిన ప్రగతి మూలాన ఇప్పటికే రాష్ట్రస్థాయిలో ఏ+ గ్రేడ్ పొందిన రెండవ కళాశాలగా, జిల్లా స్థాయిలో మొదటి కళాశాలగా గుర్తింపు తెచ్చుకుంది. ఈ నేపథ్యంలో కళాశాల ప్రతిష్ట ఇనుమడించేలా అటానమస్ (స్వయం ప్రతిపత్తి) హోదాను దక్కించుకుంది. ఫలితంగా 2024–25 విద్యా సంవత్సరం నుంచి కోర్సులు, సిలబస్, పరీక్షలు మొదలైనవన్నీ కళాశాల నియంత్రణలోనే సాగుతాయి. గురువారం ఈ హోదా లభించడం వెనుక ఎన్నో అంశాలు దీనికి దోహదం చేశాయి.

నగరి: గ్రామీణ విద్యార్థులకు ఉన్నత విద్యను అందించడానికి 1978లో నిర్మించిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీఎస్సీ, బీజెడ్సీ, బీకాం, బీఏ కోర్సులకే పరిమితమైంది. పీజీ, పీహెచ్‌డీ చేయాలంటే విద్యార్థులు తిరుపతికి వెళ్లాల్సి వచ్చేది. కళాశాలలో వసతులు, విద్యాబోధన అంతంతమాత్రంగా ఉండేది. ఆ స్థాయిలో ఉన్న కళాశాలలో క్రమక్రమంగా బీఎస్సీ (ఎంపీసీ), ఎంపీసీఎస్, ఎంఎస్‌సీఎస్, బీకాం, బీకాం (సీఏ), బీబీఏ, బీఏ(హెచ్‌ఈపీ), ఈపీసీఏ అంటూ కోర్సులను ప్రారంభించారు. నాలుగేళ్లలో ఇది మరింత జోరందుకుంది. పోస్టుగ్రాడ్యుయేషన్(పీజీ)లో ఎంకాం కోర్సులను నగరిలోనే చేసే అవకాశం కలిగింది. ఏడాది క్రితం నుంచి పీహెచ్‌డీ, ఎంఫిల్ కోర్సులను కూడా ఇక్కడే చేసే అవకాశం కలగడంతో పాటు నైపుణ్యాభివృద్ధి కోర్సులుగా టూరిజం అండ్ గైడెన్స్, ఆఫీస్ మేనేజ్‌మెంట్ కోర్సులు కూడా ఉంటున్నాయి.

గత ఏడాది ఏ+ గ్రేడ్

గ్రేడ్ పొందడానికి కళాశాల 2007 నుంచి ప్రయత్నిస్తోంది. 2007లో ఆ తర్వాత 2014లో సైకిల్ ఆడిట్ చేసినప్పుడు బీ గ్రేడ్ వచ్చింది. ప్రస్తుతం కళాశాల


ప్రభుత్వ డిగ్రీకళాశాల

కళాశాలలో బోధన, బోధనేతర సిబ్బంది

కళాశాల ప్రారంభంలో అధ్యాపకులు:	9 మంది
బోధనేతర సిబ్బంది:	8 మంది
ప్రస్తుతం	
అధ్యాపకులు:	22 మంది రెగ్యులర్
కాంట్రాక్ట్ అధ్యాపకులు:	ముగ్గురు
గెస్ట్ ఫ్యాకల్టీ:	ఒకరు
బోధనేతర సిబ్బంది:	9 మంది

పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందడంతో గ్రేడింగ్ నిర్ధారించే నాక్ బృందం 3.28 గ్రేడ్ పాయింట్లు ఇచ్చింది. జిల్లాలో ఎ ప్లస్ గ్రేడ్ సాధించిన తొలి కళాశాలగా, రాష్ట్ర స్థాయిలో ఎ+ పొందిన రెండవ కళాశాలగా గుర్తింపు నిచ్చింది. ఆ సమయంలోనే ఆంధ్రప్రదేశ్ ఉన్నత కళాశాల విద్యా కమిషనర్ అటానమస్ గుర్తింపు కోసం దరఖాస్తు చేయాలని ఆదేశించారు. దీంతో గురువారం యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ అటానమస్ (స్వయం ప్రతిపత్తి) కల్పిస్తూ నోటిఫికేషన్ జారీచేసింది. కళాశాల అభివృద్ధికి సంబంధించి ప్రిన్సిపల్, అధ్యాపకులు తన దృష్టికి తెచ్చే ప్రతి అంశంపై మంత్రి ఆర్కే రోజా ప్రత్యేక శ్రద్ధ వహించడంతో వేగంగా అభివృద్ధి సాధ్యమైంది. 152 మంది విద్యార్థులతో ప్రారంభమైన కళాశాల ఇప్పుడు 699 మందికి విద్యను బోధిస్తోంది.


డిగ్రీ కళాశాల ల్యాబ్‌లో పరిశోధనలు చేస్తున్న విద్యార్థులు (ఫైల్)


కంప్యూటర్ ల్యాబ్

అందరి సహకారంతోనే సాధ్యం



రెండు ఆడిట్ సైకిళ్లలో రాని ఏ+ గ్రేడ్‌గత ఏడాది కళాశాలకు వచ్చింది. కళాశాలలోని వసతులు, సౌకర్యాలు, విద్యార్థులకు తగిన విధంగా తరగతి గదులు, అధునాతన ల్యాబ్‌లు, జిమ్, మైదానం.. ఇలా ఎన్నో అంశాలు గ్రేడ్ పొందడానికి దోహదపడ్డాయి. సౌకర్యాలు కల్పించడంలో మంత్రి ఆర్కే రోజా పూర్తిగా సహకారమిచ్చారు. ప్రస్తుతం గ్రేడ్‌తో పాటు స్వయం ప్రతిపత్తికూడా కళాశాలకు లభించింది. మార్కెట్ ఓరియెంటెడ్, డిమాండ్ ఉన్న కోర్సులను ప్రారంభించడానికి కళాశాలకు పూరోత్ స్వేచ్ఛ ఉంటుంది. దీంతో పాటు సకాలంలో పరీక్షలు నిర్వహించి ఫలితాలు ప్రకటించడానికి అవకాశం ఉంటుంది.

– వేణుగోపాల్, ప్రిన్సిపాల్, నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి

కార్వేటినగరం: ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి సాధించవచ్చని, అలాగే పంట దిగుబడులను ఆహారంగా తీసుకోవడం ద్వారా మనిషి ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఎంపీపీ లత తెలిపారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో గురువారం ప్రకృతి వ్యవసాయం కింద పండించిన పంటల విక్రయాన్ని ప్రారంభించారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి రైతూ ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అనేక చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాసు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చన్నారు. దేశవాళి ఆవు గోమూత్రం, పేడతో 20 నుంచి 30 ఎకరాల వరకు సాగు చేసుకోవచ్చని తెలిపారు. జీవామృతం, నీమామృతం, ఘన, ద్రవ కషాయాలను తయారు చేసుకుని భూసారాన్ని పెంచుకోవచ్చన్నారు. అనంతరం ఎంఎం విలాసం, ఆర్కేవీబీపేట రైతులు ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలను విక్రయించారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, సర్పంచ్ ధనుంజయవర్మ, వైస్ సర్పంచ్ శేషాద్రి, ఎంపీడీవో మోహన్‌మురళీ, ఏఈవో గాయత్రి, లోకనాథంనాయుడు తదితరులు పాల్గొన్నారు.


పంటల విక్రయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ లత

టీబీ రోగులకు పౌష్టికాహారం కిట్ల పంపిణీ


టీబీ రోగులకు పౌష్టికాహారం కిట్లు అందజేస్తున్న డాక్టర్ రవిరాజు

కార్వేటినగరం: టీబీ రోగులకు పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా పంపిణీ చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ రవిరాజు ఆదేశించారు. ఆయన గురువారం కత్తెరపల్లి పీహెచ్‌సీలో ప్రధానమంత్రి టీబీ విముక్త్ భారత్ అభియాన్ పథకం కింద టీబీ రోగులకు పౌష్టికాహారం కిట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ టీబీ వ్యాధితో బాధపడుతున్న వారు చల్లటి నీరు తాగరాదని, చల్లటి వాతావరణంలో ఉండరాదని సూచించారు. అనంతరం పీహెచ్‌సీ రికార్డులను పరిశీలించారు. వైద్యులు డాక్టర్ భువనేశ్వరి, పర్యవేక్షకులు త్యాగు, అంబరీశ్‌రాజు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా రాష్ట్రస్థాయి పోటీలకు పుత్తూరు జట్టు


ఖో–ఖో పోటీల్లో విన్నర్స్‌గా నిలిచిన పుత్తూరు జట్టు

పుత్తూరు: ఆడుదాం ఆంధ్రా జిల్లా స్థాయి ఖో–ఖో పోటీల్లో పుత్తూరు మున్సిపాలిటీకి చెందిన సత్యనారాయణ కాలనీ సచివాలయం జట్టు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుని రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించింది. గురువారం తిరుపతి తారకరామ స్టేడియంలో ఖో–ఖో ఫైనల్స్ పుత్తూరు–సూళ్లూరుపేట జట్ల మధ్య హోరాహోరీగా జరిగాయి. చివరకు పుత్తూరు జట్టు విజయం సాధించింది. తృతీయ స్థానంలో చంద్రగిరి జట్టు నిలిచింది.

తహసీల్దార్ బాబుకు సన్మానం


తహసీల్దార్ బాబును సన్మానిస్తున్న ఏవో

పాలసముద్రం: కర్నూరు జిల్లా నందాల మండలానికి బదిలీ అయిన తహసీల్దార్ బాబును గురువారం ఎంపీడీవో కార్యాలయ ఏవో విద్యావతి ఆధ్వర్యంలో సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. మండల విస్తరణ అధికారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన ఆర్చి

- కొత్తది నిర్మించాలని గ్రామస్తుల వినతి


పగుళ్లు బారిన ఆర్చి

నగరి: శ్మశానంలో రూ.1.75 కోట్ల నిధులతో చేస్తున్న ఆధునీకరణ పనుల్లో ముఖద్వారం వద్ద నూతన ఆర్చిని నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. శ్మశానం వద్ద ఉన్న ఆర్చి పిల్లర్లు శిథిలమై, పగుళ్లు బారి, కూలిపోయే స్థితికి చేరింది. మంత్రి రోజా దీనిపై దృష్టి సారించి శిథిలమైన ఆర్చిని తొలగించి కొత్త ఆర్చి నిర్మాణానికి పూనుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మృతుడి కుటుంబానికి బీమా సాయం

నగరి: మున్సిపాలిటీలోని సత్రవాడలో ఇటీవల నేత కార్మికుడు సెంథిల్ గుండెపోటుతో మృతి చెందాడు. అతని నామినీ కుమార్తె దివ్యాంగురాలైన ఏఎస్ లావణ్యకు వైఎస్సార్ బీమా సాయాన్ని గురువారం అందజేశారు. రూ.10,000 తక్షణ సాయంగా ఇచ్చారు. మిగిలిన సొమ్ము నామినీ ఖాతాకు జమ అవుతుందని సచివాలయ కార్యదర్శి సతీష్ తెలిపారు. కార్యక్రమంలో స్థానిక పార్టీ నాయకులు ఈకే జగన్నాథం, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.


వైఎస్సార్ బీమా సాయం అందజేస్తున్న కార్యదర్శి

ఎంపీఈవో ఆత్మహత్యాయత్నం

శ్రీకాళహస్తి :మండలంలోని ఇనగలూరు ఆర్‌బీకేలో మల్టీ పర్పస్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ (ఎంపీఈవో) శ్రీలక్ష్మి(30) గొంతుకోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తిరుపతికి చెందిన శ్రీలక్ష్మి(30) ఇనగలూరు ఆర్‌బీకేలో ఎంపీఈవోగా పనిచేస్తున్నారు. సహజంగా ఎంపీఈవోలు ఎరువులను విక్రయించి వచ్చే నగదును ఎప్పటికప్పుడు మార్క్‌ఫెడ్ బ్యాంకు అకౌంట్‌లో జమచేయాల్సి ఉంది. గత పదిహేను రోజులుగా ఇక్కడి ఆర్‌బీకేలో రూ.73,000లకు ఎరువుల విక్రయాలు జరిగినా శ్రీలక్ష్మి నగదును జమ చేయకుండా జాప్యం చేస్తూ వచ్చారు. ఎరువుల ఎంపీఈవోలు నగదును జమచేయాలంటూ మంగళవారం వ్యవసాయాధికారి నుంచి సంబంధిత వాట్సాప్ గ్రూపులో మెసేజ్ వచ్చింది. అదేరోజు రాత్రి శ్రీలక్ష్మి గాజుల మండ్యం సమీపంలో గొంతుకోసుకుని ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ కుటుంబ సభ్యులకు సమాచారం అందించింది. కంగారుపడిన కుటుంబసభ్యులు అక్కడికి వెళ్లి చూడగా గొంతుకోసుకుని రక్తస్రావం జరుగుతుండడంతో రేణిగుంటలోని ఓ ఆస్పత్రికి తరలించగా, ప్రమాదం తప్పడంతో కోలుకుంటోంది. కాగా రైతుభరోసా కేంద్రంలో ఎరువులు అమ్మిన డబ్బులు బ్యాంక్ ఖాతాలో జమచేయమని అధికారులు కోరడంతో ఏమి చేయాలో తోచక తాను ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు శ్రీలక్ష్మి ఆస్పత్రి నుంచి ఓ వాట్సాప్ వీడియో రిలీజ్ చేయడం కొసమెరుపు.

పఠనా సామర్థ్యాలను పెంపొందించాలి

సత్యవేడు: ఇంగ్లిషు, తెలుగు సబ్జెక్టుల్లో పఠనా సామర్థ్యాలను పెంపొందించాలని ఎంఈఓ కె.రవి సూచించారు. గురువారం గొల్లపాళెం ఎంపీపీఎస్ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులను ప్రశ్నలు వేసి సామర్థ్యాలను తెలుసుకోన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. రుచి కరమైన భోజనాన్ని పెట్టాలని వంట నిర్వాహకులకు సూచించారు. పదార్థాలు రుచి చూశారు. హెచ్‌ఎం ప్రభావతి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యం


గుమ్మడి కుతూహలమ్మ సమాధి వద్ద కుటుంబ సభ్యులతో నివాళులర్పిస్తున్న నూకతోటి రాజేష్

- సత్యవేడు నియోజక వర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్

గంగాధర నెల్లూరు: అధిష్టానం ఏ ఉద్దేశంతో అయితే తనకు వైఎస్సార్ సీపీ సత్యవేడు నియోజక వర్గ సమన్వయకర్తగా నియమించిందో ఆ లక్ష్యసాధనకు అంకితభావంతో కృషి చేస్తానని నూకతోటి రాజేష్ స్పష్టం చేశారు. బుధవారం విజయవాడలో పార్టీ అధిష్టానం విడుదల చేసిన నియోజకవర్గాల ఇన్‌చార్జుల జాబితాలో సత్యవేడు అసెంబ్లీ స్థానానికి రాజేష్‌ను ఖరారు చేయడం విదితమే. ఈ నేపథ్యంలో గురువారం ఆయన మండలంలో వింజం పంచాయతీలోని లక్ష్మీరెడ్డిపల్లెకు వచ్చారు. ఇక్కడ తన మాతృమూర్తి, దివంగత మాజీ మంత్రి గుమ్మడి కుతూహలమ్మ సమాధి వద్దకు వెళ్లి పూజలు చేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కుటుంబ పరంగా, రాజకీయ పరంగా ఏ కార్యం తలపెట్టినా తొలుత తన తల్లి సమాధికి నివాళులు అర్పించి, ఆశీస్సులు పొందడం..మానసికంగా ఎంతో బలాన్ని, ధైర్యాన్నీ ఇస్తుందని, ఆ స్థైర్యంతోనే సత్యవేడు సెగ్మెంట్‌లో అందరి సహకారంతో వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం పాటుపడతానన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టేందుకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జిల్లాలోని పార్టీ సీనియర్ నాయకులందరి ఆశీస్సులు, సత్యవేడు నాయకుల సమన్వయ సహకారంతో ముందుకువెళ్లనున్నట్టు చెప్పారు. తొలుత ఆయనకు గ్రామంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభిమానులు పుష్పగుచ్ఛాలతో ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం గ్రామ దేవతకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో స్థానిక పార్టీ నాయకులు బాల సుబ్రమణ్యం దేవా, చంద్రారెడ్డి, భానుచంద్రారెడ్డి, రామచంద్రారెడ్డి, యువరాజ్ పాల్గొన్నారు.

ఘనంగా మహా కుంభాభిషేకం



కుంభాభిషేకం చేస్తున్న వేదపండితులు, ప్రత్యేక అలంకరణలో వళ్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి

కార్వేటినగరం: స్కంధ పుష్కరిణి సమీపంలో కుమార గిరిపై వెలసిన వళ్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో గురువారం మహా కుంభాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామునే సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి నిత్యకైంకర్యాలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో 108 కలశాలను ఏర్పాటు చేసి గణపతి హోమం, సుబ్రమణ్యస్వామి హోమం, నవగ్రహ హోమం చేశారు. అనంతరం పూర్ణాహుతి చేపట్టారు. మూలస్థాన గోపురంపై ప్రత్యేక పూజలు చేసి కలశాలలోని పవిత్ర జలాలతో అభిషేకించారు. అదే విధంగా నవగ్రహ ఆలయం గోపురంపై కూడా ప్రత్యేక పూజలు నిర్వహించి గోపురం శిఖరాన్ని కలశంలోని జలాలతో అభిషేకించారు. అనంతరం రాజగోపురానికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ అధ్యక్షుడు కేశవరెడ్డి తీర్థ ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో ఎండోమెంట్ ఈవో కృష్ణనాయక్, ఆలయ కమిటీ సభ్యులు పయణిరెడ్డి, కుప్పారెడ్డి, కుమారాచారి, జయమ్మ, రేవతి, అర్చకులు హరికుమార్ పాల్గొన్నారు.

స్థల వివాదం కేసులో దంపతులకు జైలు శిక్ష

పాలసముద్రం: ఇంటి స్థల వివాదం కేసులో దంపతులకు ఒకటిన్నర ఏడాది జైలు శిక్ష, రూ.3 వేల జరిమానా విధిస్తూ చిత్తూరు ఒకటో ఏడీఎం కోర్టు జడ్జి మాధవి తీర్పు చెప్పినట్టు కోర్టు కానిస్టేబుల్ బాషా తెలిపారు. మండలంలోని క్రిష్ణజమ్మాపురం పంచాయతీ కొల్లిరెడ్డికండ్రిగ గ్రామానికి చెందిన గోపి (42), చందామర్రై(38) దంపతులు అదే గ్రామానికి చెందిన వ్యక్తులతో ఇంటి స్థలం విషయంపై గొడవ పడ్డారు. ఈ క్రమంలో బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దంపతులను అరెస్టు చేశారు. ఈ కేసు రెండు సంవత్సరాలుగా విచారణ జరిపిన జడ్జి మాధవి గురువారం తీర్పు వెలువరించారు.


నిందితులు గోపి, చందామర్రై

కూలీలందరికీ వందరోజులు 'ఉపాధి'


సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ గంగాభవాని

విజయపురం(నగరి): మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద కూలీలకు వందరోజుల పనిదినాలు కల్పించడం హర్షణీయమని డ్వామా పీడీ గంగాభవాని అన్నారు. గురువారం విజయపురం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ చంద్రమౌళి అధ్యక్షతన 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 16వ విడత సామాజిక తనిఖీ బహిరంగ గ్రామసభ నిర్వహించారు. 2022–23 సంవత్సరం గాను రూ. 8. 26 కోట్ల ఖర్చు చేసినట్లు అధికారులు తెలిపారు. దీనిలో వేతన కింద కూలీలకు సుమారు రూ.70లక్షలు ఇచ్చినట్టు చెప్పారు. తొలుత ఆయా పంచాయతీలో చేసిన ఉపాధి పనులను అధికారులు నివేదించారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి భాగ్యలక్ష్మి, నగరి క్లస్టర్ ఏపీడీ శోభన్‌బాబు, ఏపీఓ బబిత తదితరులు పాల్గొన్నారు.

ఆగమోక్తంగా బాలాలయ స్థాపన పూజలు


కలశాలను ఊరేగింపుగా తీసుకు వస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం అనుబంధంగా ముత్యాలమ్మగుడివీధిలో వెలసిన ఏడు గంగమ్మల ఆలయ జీర్ణోద్ధారణ, ఆధునికీకరణ పనుల్లో భాగంగా గురువారం ఆగమోక్తంగా బాలాలయ పూజలు నిర్వహించారు. ముందుగా కలశ స్థాపనను శాస్త్రోక్తంగా చేపట్టారు. హోమ పూజలను నిర్వహించారు. ప్రధాన కలశాన్ని ఆలయ ఆవరణంలో వైభవంగా ఊరిగించి, గంగమ్మ తల్లికి కలశ జలాలతో విశేష అభిషేకాలు నిర్వహించి, విశేషంగా అలంకరించారు. తదుపరి సంప్రదాయ పద్ధతిలో బాలాలయ పూజలను పండితులు వేదోక్తంగా నిర్వహించారు.

రూ.40 లక్షలతో ఆధునికీకరణ

పూజల్లో పాల్గొన్న దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ ఏడు గంగమ్మల ఆలయాన్ని రూ.40లక్షలతో ఆధునీకరణ చేసి ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా తీర్చిదిద్దుతున్నామన్నారు. పాలకమండలి సభ్యురాలు రమాప్రభ, ఆలయ అధికారులు వెంకటసుబ్బయ్య, స్థపతి కుమార్, సూర్యప్రసాద్, వేదపండితులు సంబంధం గురుకుల్, దక్షిణామూర్తి, అర్ధగిరి, ప్రముఖులు బాలసుబ్రహ్మణ్యం, స్వర్ణమూర్తి, భాస్కర్ ముదిరాజ్, జలకం కిషోర్, రవి, బాలగౌడ్ పాల్గొన్నారు.


కలశ పూజలు చేస్తున్న వేదపండితులు